సాక్షి ఖమ్మం

మంగళవారం। 15। ఏప్రిల్। 2025



సొత్తు మనదే.. రక్షణా మనదే..

సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్లలో చోరీ జరిగిన నేపథ్యాన ఉద్యోగులు సొంతంగా సెక్యూరిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. 8లో



శిశుగృహకు కవల ఆడపిల్లలు

కవల ఆడపిల్లలను పోషించలేమని తల్లిదండ్రులు అక్రమంగా దత్తతకు ఇవ్వగా వారిని చేరదీసిన అధికారులు శిశుగృహకు తరలించారు. 8లో

గరిష్టం / కనిష్టం 37° / 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం, రాత్రి వాతావరణం కాస్త చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఎండ నమోదవుతుంది.

న్యూస్‌రీల్

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సింగరేణి గనుల్లో నీరు చేరింది. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో వరద నీరు నిలవడంతో సోమవారం బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కిష్టారం ఓపెన్‌కాస్ట్‌లో 5వేల టన్నులు, జేవీఆర్ ఓసీలో 20వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు.

కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీఓ చందన్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో కాంటా పూర్తిచేయగా.. ఆదివారం రాత్రి వర్షానికి తడిసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. తల్లాడ, కల్లూరు మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాలను ఆయన సోమ వారం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్ల నిర్వాహకులు, మిల్లర్లతో మాట్లాడి ధాన్యం తరలించేందుకు వాహనాలు సమకూర్చారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం కార్యవర్గం ఎన్నిక





అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి ఫజల్, రామారావు, వినోద్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ అనుబంధంగా తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జిల్లా సంయుక్త కార్యదర్శి తాళ్లూరి శ్రీకాంత్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. దీంతో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ఫోరం అధ్యక్షుడిగా ఎం.డీ.ఫజల్, కార్యదర్శిగా ఎం.రామారావు, అసోసియేట్ అధ్యక్షులుగా బి.సైదులు, కోశాధికారిగా ఎస్.వినోద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.గాంధీనాయక్, కె.ఉపేందర్, భారతి, సంయుక్త కార్యదర్శులుగా కె.వంశీ, ఎన్.రఘు, ఎస్ .అనిత, కార్యాలయ, క్రీడా, ప్రచార కార్యదర్శులుగా ఎస్.ఉదయ్, పి.శ్రీనివాస్, పి.వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.రవిప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, ఏ.సురేష్, విజయ్, వి.నరసింహారావు ఎన్నికయ్యారు ఈమేరకు కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బలరాం, పి.వెంకటరమణ, నాయకుడు దుర్గాప్రసాద్ అభినందించారు.

రాష్ట్రంలో మనమే టాప్!

'రాజీవ్ యువ వికాసం'కు పోటెత్తిన దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుచేసుకునేలా సబ్సిడీ రుణాల మంజూరుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించింది. ఈమేరకు జిల్లా నుంచి అత్యధిక దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది. దరఖాస్తు గడువు సోమవారంతో ముగియగా సర్వర్ మొరాయించింది. దీంతో చివరి మూడు రోజులు ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా కూడా దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం సాయంత్రం వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 29,076 మంది, బీసీ కార్పొరేషన్ ద్వారా 41,868 మంది దరఖాస్తులు అందాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. కాగా, దరఖాస్తు గడువు పొడిగిస్తారనే ప్రచారం జరిగినా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు.

80వేలకు పైగానే...

రాజీవ్ యువ వికాసానికి రాష్ట్రంలోనే అత్యధిక దరఖాస్తులు జిల్లా నుండే అందినట్లు తెలుస్తోంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 29,076 దరఖాస్తులతో జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఇందులో అత్యధికంగా ఐఎస్‌బీ(ఇండస్ట్రియల్ సర్వీసెస్ బిజినెస్) స్కీంకు 24,405 దరఖాస్తులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇక అన్ని శాఖలకు కలిపి ఆఫ్‌లైన్‌లో 10,466 దరఖాస్తులు అందినట్లు తెలిసింది. వీటిలో ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 3,231, గిరిజన అభివృద్ధి శాఖకు 1,466, బీసీ కార్పొరేషన్‌కు 4,801, ఈబీసీలు 150, మైనార్టీలు 806, క్రిస్టియన్లు 12 దరఖాస్తులను అధికారులకు అందించినట్లు సమాచారం.

అంగన్‌వాడీల్లో కొత్త బడి..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ తరగతులు మొదలుకానున్నాయి. గతంతో పోలిస్తే భిన్నంగా ఈ తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ కసరత్తు చేస్తున్నాయి. కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ తరగతుల బోధనకు విద్యావలంటీర్లను నియమించనున్నట్లు తెలుస్తుండగా.. పూర్తిస్థాయిలో విధివిధానాలు ఖరారు కావాల్సి ఉంది. తొలిదశలో జిల్లాలోని 30 కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యను రానున్న విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్నారు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



రంగులు, బొమ్మలతో తీర్చిదిద్దిన ఖమ్మం ఐదో డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

- పాఠశాలల ఆవరణలోని కేంద్రాల్లో నిర్వహణ
- నర్సరీ నుంచి యూకేజీ వరకు బోధనకు కసరత్తు
- తొలిదశలో జిల్లాలోని 30 కేంద్రాల ఎంపిక
- విద్యా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు

పూర్వ విద్య బలోపేతం దిశగా..

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించడం, చిన్నారులకు బోధన కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి.. ఆటపాటలతో విద్యాబోధన చేస్తారు. అయితే చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు ఆసక్తి చూపడం లేదు. కొందరు పంపించినా ఒకటో తరగతికి వచ్చేలోగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా కేంద్రాల్లో మూడు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీ తరగతులు బోధిస్తారు.

మొదట 30 కేంద్రాల్లో..

వచ్చే విద్యాసంవత్సరం నుంచి జిల్లాలో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తారు. తొలి విడతలో నియోజకవర్గానికి ఆరు చొప్పున ఐదు నియోజకవర్గాల్లో కలిపి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 30 అంగన్‌వాడీల్లో తరగతులు ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే, ఏయే పాఠశాలల్లో తరగతులు మొదలుపెడతారనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కేంద్రాలను ఎంపిక చేసి విద్యాశాఖకు వివరాలు సమర్పిస్తారు.

ముమ్మరంగా కసరత్తు

ప్రస్తుతం ప్రారంభించనున్న ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై విద్యాశాఖ, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏయే కేంద్రాలను ఎంపిక చేయాలి, ఆతర్వాత ఎలాంటి వసతులు కల్పించాలనే అంశంపై దృష్టి సారించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న తరగతులకన్నా భిన్నంగా బోధించేలా పాఠ్యాంశాలను సైతం రూపొందించనున్నారు.

విద్యావలంటీర్లతో బోధన..

ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో విద్యాబోధన కోసం విద్యావలంటీర్లను నియమించే ఆలోచనలో విద్యాశాఖ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్ల విద్యార్హత ఇంటర్‌మీడియట్. దీంతో పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న విద్యాశాఖ టీటీసీ / బీఈడీ అర్హత ఉన్న వారిని విద్యావలంటీర్లుగా నియమించే దిశగా ఆలోచన చేస్తోంది. అయితే, ప్రైవేట్ రంగంలో ప్రీ ప్రైమరీ పాఠశాలలకు విద్యాశాఖ గుర్తింపు ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వపరంగా ఏర్పాటుచేసే ఈ కేంద్రాల నిర్వహణకు ఎలాంటి నియమ, నిబంధనలు రూపొందిస్తారు.. గుర్తింపు ఎలా ఇస్తారు అన్న అంశంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముంది.

● ప్లే స్కూల్ తరహాలో..

చిన్నారుల కోసం ప్రైవేట్ రంగంలో పలు ప్లే స్కూళ్లు అందుబాటులో ఉన్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులకు ఆటపాటల ద్వారా బోధించడం ద్వారా పాఠశాలల వాతావరణం అలవాటయ్యేలా చూస్తారు. తద్వారా వయస్సు పెరిగి కొద్దీ పిల్లల్లో పాఠశాలలపై ఆసక్తి పెరుగుతుంది. ఇదే తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నా బోధనలో సమూల మార్పులు తీసుకొచ్చేలా ప్రీ ప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్‌తోపాటు కిట్ కూడా అందజేస్తారు. కిట్‌లో బొమ్మలు, పుస్తకాలు, టై, బూట్లు సమకూర్చనున్నారు. అలాగే, ఆట వస్తువులను విద్యాశాఖ అందిస్తుంది.

జిల్లాలో అంగన్‌వాడీల వివరాలు

మొత్తం కేంద్రాలు	పాఠశాలల్లో కొనసాగుతున్నవి	సొంత భవనాలు ఉన్నవి	అద్దెలేని భవనాల్లో కొనసాగుతున్నవి	అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు
1,840	701	940	440	460

ఆర్చరీ డెవలప్‌మెంట్ కమిటీలో జిల్లా వాసి

సభ్యుడిగా పుట్టా శంకరయ్యకు స్థానం



పుట్టా శంకరయ్య

ఖమ్మం స్పోర్ట్స్: ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ద్వారా దేశవ్యాప్తంగా విలువిద్యకు మరింత ప్రాచుర్యం తీసుకురావడం, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేలా ఎనిమిది మందితో కూడిన డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటుచేసింది. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి, ఒలింపిక్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పుట్టా శంకరయ్యకు స్థానం దక్కింది. తెలంగాణ నుంచి ఈయనకు మాత్రమే సభ్యుడిగా స్థానం దక్కగా, కమిటీ చైర్మన్‌గా ఏఏఐ ఉపాధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ, కన్వీనర్‌గా సుమంత చంద్ర మహంతి వ్యవహరిస్తారు. సభ్యులుగా శంకరయ్యతో పాటు జంయాంగ్ థ్సెరింగ్ నంజ్యాల్(లధాఖ్), కె.దేవానంద సింగ్(మణిపూర్)తో పాటు ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు సంజీవ్ సింగ్, పూర్ణిమ మహతో, జివాంజోత్ సింగ్ తేజ ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజనులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించేలా తీర్చిదిద్దిన శంకరయ్య.. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్‌లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. విలువిద్యలో సహజసిద్ధమైన ప్రతిభ కలిగి ఉండే గిరిజన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా కృషి చేశారు. కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌కు వ్యాయామ ఉపాధ్యాయులుగానే కాక భద్రాచలం ఐటీడీఏ క్రీడాధికారిగానూ పనిచేశారు.

సీఎం సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టర్



సీఎం సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూభారతి చట్టాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వాన కలెక్టర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఇన్‌చార్జ్ కలెక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కృషితోనే సమానత్వం



ఈర్లపుడిలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన సీపీ సునీల్‌దత్ తదితరులు

విగ్రహావిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: సమాజంలోని ప్రతీఒక్కరికి సమాన హక్కులు కావాలనే డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగానికి రూపకల్పన చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నవభారత వికాసానికి బాటలు వేయడమే కాక అణగారిన వర్గాల సంక్షేమం, విద్యా అభివృద్ధి, కుల వివక్ష నిర్మూలనకు పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో 'జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్' నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మానుకొండ రాధాకిషోర్., గుత్తా వెంకటేశ్వర్లు వాంకుడోతు దీపక్, దేవ్‌సింగ్, బాలాజీ, కొంటెముక్కల నాగేశ్వరరావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, రఘునాథపాలెం మండల పర్యటనలో భాగంగా చింతగుర్తిలో ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి వస్తున్న కూలీలతో మాట్లాడిన మంత్రి పని ప్రదేశాల వద్ద సౌకర్యాలు, కూలిపై ఆరా తీశారు.

మహనీయుల సిద్ధాంతాలను మరవొద్దు..

ఇన్‌చార్జ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ, తదితరులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, రాయల తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మహనీయుల సిద్ధాంతాలు మరువకుండా నేటి తరం కొనసాగించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. మానవాళికి దిశానిర్దేశం చేసిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలు నిత్యం అనుసరణీయమని తెలిపారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంటరానితనం, బానిసత్వం, అస్పృశ్యత నిర్మూలనకు, వివక్షపై అలుపెరుగకుండా పోరాడిన అంబేడ్కర్ కృషితో అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు లభించాయని తెలిపారు. అంతకుముందు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, గిడ్డంగుల సంస్థ, నీటిపారుదల అభివృద్ధి సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆతర్వాత భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలను ఆచరణలో చూపాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ డీడీ కస్తాల సత్యనారాయణ, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ కొట్టే సుధాకర్, అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య, గౌరవ అధ్యక్షుడు మట్టే గురుమూర్తి, నందిపాటి మనోహర్, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా గిరి ప్రదక్షిణ



నక్షత్రజ్యోతిని దర్శించుకుంటున్న భక్త జనం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి(గుట్ట) కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ సోమవారం వైభవంగా కొనసాగింది. స్వామి జన్మ నక్షత్రం(స్వాతి) సందర్భంగా ప్రతీనెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ స్వామిని పల్లకీలో ఊరేగిస్తూ పెద్దసంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ఈసందర్భంగా నృసింహ నామ స్మరణతో పరిసరాలు మార్మోగాయి. అనంతరం గుట్టపై ఆలయం పక్కన రాతి కొండపై నక్షత్ర జ్యోతి వెలిగించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ప్రకృతి పంజా

అకాల వర్షంతో రైతుల ఆగమాగం

- పలుచోట్ల నేలవాలిన వరి, మొక్కజొన్న, రాలిన మామిడి
- 3,094 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా



కల్లూరు : రామానగర్ వద్ద తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

మరికొన్ని ఫొటోలు 8లో

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలతో యాసంగి పంటలపై ప్రకృతి పంజా విసురుతోంది. పంటలు చేతికందే సమయాన వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా ఈదురుగాలులు వీస్తుండడమే కాక అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల ఆరంభం నుంచి తరచూ ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఆదివారం రాత్రి సైతం జిల్లాలోని పలుచోట్ల అకాల వర్షం కురిసింది. ఈదురుగాలుతో కూడిన వడగళ్ల వాన కురవగా.. కల్లాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్నలు, మిర్చి తడిసిపోయాయి. చాలాచోట్ల తోటల్లో మామిడికాయలు నేలరాలడంతో కోతకు సిద్ధమవుతున్న రైతులు ఆవేదన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా గన్నీ బ్యాగ్‌లు సమకూర్చకపోవడం, కాంటా వేసినా మిల్లులకు తరలించకపోవడంతోనే తాము నష్టపోయామని రైతులు ఆరోపించారు.

జిల్లాలో 9.4 మి.మీ. వర్షపాతం

ఆదివారం జిల్లా సగటు వర్షపాతం 9.4 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా కల్లూరులో 41 మి.మీ., చింతకానిలో 32.8, సత్తుపల్లిలో 15.6, పెనుబల్లిలో 21.2, బోనకల్ 19.8, వైరా 12.6, కొణిజర్లలో 11.8, మధిర 8.6, తల్లాడ 7.4, ఖమ్మం అర్బన్‌లో 5.6 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. అలాగే, ముదిగొండలో 4.8, రఘునాథపాలెంలో 4.6, వేంసూరు 3.2, నేలకొండపల్లిలో 2.6, ఖమ్మం రూరల్‌లో 2.4, కూసుమంచిలో 1.6, ఎర్రుపాలెం 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

చేతికందే దశలో భారీ నష్టం

ఈదురుగాలులు, అకాల వర్షానికి జిల్లాలో 3,094 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. జిల్లాలో వర్షప్రభావం ఉన్న ప్రాంతాల్లో ఉద్యోగులు సోమవారం పర్యటించి నష్టంపై అంచనా వేశారు. కల్లూరు మండలంలో వరి 1,018 ఎకరాల్లో, మొక్కజొన్న ఆరు ఎకరాలు, తల్లాడ మండలంలో వరి 350 ఎకరాల్లో మొక్కజొన్న 30 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. నాలుగు రోజుల క్రితం కూడా జిల్లాలో మొక్కజొన్న 180 ఎకరాల్లో, వరి 105 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తేల్చారు. వ్యవసాయ శాఖ నివేదికలు ఇలా ఉండగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33శాతం పంటలకు నష్టం వాటిల్లితేనే పరిహారం చెల్లిస్తారు.



నేలకొండపల్లి : మార్కెట్‌లో తడవడంతో ఆరబెట్టిన ధాన్యం బస్తాలు

అయితే, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంటుంది. ఇక ఉద్యాన పంటలకు సంబంధించి మామిడికాయలు రాలుతున్నాయి. కానీ నిబంధనల ప్రకారం తోట సమూలంగా విరిగిపడితేనే పరిహారం వర్తిస్తుంది. జిల్లాలో మామిడి, బొప్పాయి వంటి పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఇక కల్లాల్లో ఆరబోసిన పంటలు దెబ్బతిన్నా పరిహారం ఉండదు. అకాల వర్షాలకు కల్లాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న, మిరప పంటలకు నష్టం వాటిల్లుతోంది.

మండలాల వారీగా ఇలా...

- **తల్లాడ:** మండలంలో అకాల వర్షానికి మామిడి కాయలు నేలరాలగా, వరి పైర్లు నేలకొరిగాయి. కుర్నవల్లిలో రూ.57 లక్షల నాబార్డు నిధులతో నిర్మిస్తున్న సొసైటీ రేకుల షెడ్డు కూలిపోయింది. పైర్లలో వడ్లు రాలిపోవడం, కల్లాల్లో ధాన్యం, మిర్చి తడవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.
- **వేంసూరు:** మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు ఉరుకులు, పరుగులతో కల్లాలకు వెళ్లి ధాన్యం, మొక్కజొన్న రాశులు తడవకుండా పట్టాలు కప్పారు. అయితే, ఈదురుగాలితో పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది.
- **కల్లూరు/కల్లూరు రూరల్:** మండలంలో అకాల వర్షం, ఈదురుగాలులు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. తోటల్లో మామిడికాయలు నేలరాలాయి. లింగాల, ఎర్రబోయినపల్లి, చంద్రుపట్ల, పుల్లయ్యబంజరు, లోకవరం, పేరువంచ, కొర్లగూడెం, నారాయణపురం, ఎర్రబంజరు, కల్లూరు, బత్తులపల్లి, లక్ష్మీపురం, గోకవరం, పాయపూర్, ముచ్చవరంల్లో ధాన్యం రాశులు తడిసిపోగా, రంగు మారితే ధర తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- **వైరారూరల్:** వైరా మండలంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి మామిడి రైతులు నష్టపోయారు. తాటిపూడి, ఖానాపురం, నారపునేనిపల్లి, కొండకొడిమల్లోని తోటలు కాయలు నేలరాలగా, విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం,ల్లో ధాన్యం రాశులు తడిసాయి. అలాగే, ఖానాపురం, గన్నవరం తదితర గ్రామాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
- **నేలకొండపల్లి:** మండలంలోని వివిధ గ్రామాల రైతులు అకాల వర్షంతో విలవిల్లాడారు. నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, మండ్రాజుపల్లి, రాజేశ్వరపురం, బోదులబండలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిగా, సోమవారం ఉదయం నుంచి ఆరబెట్టడంలో నిమగ్నమయ్యారు. కాంటా వేసిన బస్తాలను మిల్లులను తరలిచకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని రైతులు వాపోయారు.

క్లుప్తంగా

దేశప్రజలకు వరం.. రాజ్యాంగం



పార్టీ శ్రేణులతో ప్రమాణం చేయిస్తున్న సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశప్రజలకు వరం వంటిదని, అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందడానికి కారణమైందని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యాన ఖమ్మంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా రాజ్యాంగ పీఠిక పత్రాన్ని చదువుతూ రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని, అంబేడ్కర్ ఆశయన సాధనకు కృషి చేస్తామని పార్టీ శ్రేణులతో సుధాకర్‌రెడ్డి ప్రమాణం చేయించాక మాట్లాడారు. ఈకార్యక్రమంలో నాయకులు గోంగూర వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, సన్నె ఉదయ్ ప్రతాప్, దేవకి వాసుదేవరావు, నున్నా రవి, ఈ.వీ.రమేష్, దొంగల సత్యనారాయణ, కోటమర్తి సుదర్శన్, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, విజయరెడ్డి, మందా సరస్వతి, మణి, స్వరూప, నీలిమ, నీరుడుకొండ ఉషారాణి, రేఖ సత్యనారాయణ, మాడుగుల చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై నిరసన



ముదిగొండ : గోకినేపల్లిలో ఆందోళనకు దిగిన రైతులు

తల్లాడ/ముదిగొండ: పదిహేను రోజుల క్రితం ధాన్యం కోతలు పూర్తిచేసి కల్లాల్లో అరబెట్టినా కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని రైతులు సోమవారం ఖాళీ పురుగు మందుల డబ్బాలతో నిరసన తెలిపారు. తల్లాడ మండలంలోని కిష్టాపురంలో ధాన్యం సిద్ధం చేసినా గన్నీ సంచులు ఇవ్వడం లేదని, వర్షానికి నష్టపోయే ప్రమాదముందని వారు వాపోయారు. అధికారుల తీరు మారకపోతే ఆత్మహత్య చేసుకుంటామని వెల్లడించగా.. అధికారులు తేమ శాతం తగ్గగానే కాంటా వేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అలాగే, ముదిగొండ మండలం గోకినేపల్లి రైతులు ఖమ్మం–కోదాడ రహదారిపై ఆందోళనకు దిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మూడు రోజులైనా కాంటా వేయకపోవడంతో అకాల వర్షానికి నష్టపోయామని తెలిపారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాళ

కూసుమంచి/రఘునాథపాలెం: కూసుమంచి మండలంలోని రాజుపేట గ్రామంలో జై భీమ్ బహుజన సంఘం ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఈ విగ్రహాలను సోమవారం రాజుపేట గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ త్యాగ నిరతి, దేశానికి వారు అందించిన సేవలను కొనియాడారు. అలాగే, రఘునాథపా మండలం మంచుకొండలో అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అవిష్కరించారు. ఈకార్యక్రమంలో గుత్తా రవి, భూక్యా లక్ష్మణ్‌నాయక్, అజ్మీరా వీరునాయక్, మందా సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ప్రిన్సిపాల్



గొలుసు అందజేస్తున్న నరేష్

ఖమ్మంక్రైం: ఓ వ్యాపారి చేజార్చుకున్న బంగారు గొలుసును అప్పగించిన ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ నిజాయితీ చాటుకున్నారు. ఖమ్మం ట్రంక్‌రోడ్డులోని టీ స్టాల్ వద్దకు సోమవారం వెళ్లిన వ్యాపారి నూనె మురళీధర్ మెడలో ఉన్న బంగారు గొలుసు జారిపడింది. ఇంటికి వెళ్లాక గమనించిన ఆయన దారంతా వెతికినా లభించలేదు. ఇంతలో సారథినగర్‌కు చెందిన శ్రీవైష్ణవి ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ దొండేటి నరేష్‌కు గొలుసు దొరకకగా ఆయన త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. ఈలోగా ఫిర్యాదు చేయటానికి మురళీధర్ రాగా సీఐ రమేష్ సమక్షంలో ఆయనకు నరేష్ గొలుసు అప్పగించగా కృతజ్ఞతలు తెలిపాడు.

సొత్తు మనదే.. రక్షణా మనదే...



సింగరేణి క్వార్టర్స్‌లో సమావేశమైన కార్మికుల కుటుంబాలు

- సొంతంగా సెక్యూరిటీ ఏర్పాటుకు సింగరేణి ఉద్యోగుల నిర్ణయం
- 24గంటల పాటు నిఘా కోసం గార్డుల నియామకం

సత్తుపల్లి: సత్తుపల్లిలో సింగరేణి ఉద్యోగుల కోసం క్వార్టర్స్ నిర్మించిన పీ.వీ.నర్సింహారావు కాలనీలో చోరీలతో ఆందోళన నెలకొంది. ఈనెల 8న పలువురి క్వార్టర్లలో చొరబడిన దుండగులు రూ.80లక్షల మేర సొత్తు అపహరించారు. ఏడాది క్రితం కూడా ఇలాగే చోరీ జరిగింది. మూడు షిఫ్టులుగా సిబ్బంది ఉద్యోగాలకు వచ్చివెళ్తుండడంతో ఎవరినీ ప్రశ్నించే పరిస్థితి లేకపోవడం దొంగలకు సులువైందని భావిస్తున్నారు. ఈనేపథ్యాన సొంతంగానే సింగరేణి క్వార్టర్స్ పరిసరాల్లో నిఘా ఏర్పాటుకు నిర్ణయించారు. ఈమేరకు ఆదివారం రాత్రి సమావేశమై ఉద్యోగుల కుటుంబాలు రక్షణ చర్యలు ఎలా చేపట్టాలనే అంశంపై చర్చించారు. అంతేకాక ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం ఎం.డీ.రజాక్ నేతృత్వంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజును కలిసి సమస్యను వివరించారు.

మళ్లీ దొంగతనాలు జరగకుండా..

సింగరేణి క్వార్టర్స్‌లో జీ+1 కింద ఏడు బ్లాక్‌ల్లో 28 ఇళ్లు, ఎంసీ క్వార్టర్లలోని ఆరు బ్లాక్‌ల్లో 72 చొప్పున మొత్తం 352 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కొందరు తమ ఇళ్ల సమీపంలో సొంతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. అయినా ఫలితం లేకపోవటంతో షిఫ్టుల వారీగా మూడు బ్లాక్‌ల్లో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ప్రతీ కుటుంబం నుంచి రూ.100 నుంచి రూ.200 ఇస్తే రూ.35వేల నుంచి రూ.70వేలు జమ అవుతాయని.. తద్వారా సెక్యూరిటీ గార్డుల నియామకం సులవవుతుందనే భావనకు వచ్చారు. అంతేకాక సింగరేణి సంస్థ నుంచి కూడా సహకారం తీసుకోవాలని.. ఆపై క్వార్టర్ల చుట్టూ సోలార్ ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు.

నేడు సేఫ్టీ బృందం పరిశీలన

సింగరేణి క్వార్టర్లలో రక్షణ చర్యలను పర్యవేక్షించేందుకు కొత్తగూడెం ఏరియా ఎస్‌టీటీ–2 జీఎం కోటిరెడ్డి మంగళవారం పరిశీలనకు వస్తున్నారు. అయితే, సంస్థ క్వార్టర్లలో ఎక్కడా కూడా రక్షణ చర్యలకు నిధుల కేటాయింపు లేదని తెలుస్తోంది. కేవలం పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు పంపిణీ బాధ్యతలు మాత్రమే సింగరేణి సంస్థ నిర్వర్తిస్తున్నందున జీఎం తన పర్యటనలో ఏం చెబుతారోనని వేచి చూస్తున్నారు.

రక్షణ చర్యలు తప్పనిసరి..



సింగరేణి క్వార్టర్స్‌లో అవసరమైన రక్షణ చర్యలు తప్పక తీసుకోవాల్సిందే. ఇందుకోసం ఉద్యోగులమంతా కుటుంబాలతో సహా సమావేశమై ఓ నిర్ణయానికి వచ్చాం. ఇందులో నిర్ణయించిన అంశాలను త్వరలోనే కార్యరూపంలోకి తీసుకొస్తాం.

– జి.నర్సింహారావు, సింగరేణి కార్మికుడు

నిఘా నిరంతరం ఉండాలి..



సింగరేణి క్వార్టర్స్‌లో నిఘా నిరంతరం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం తమ బాధ్యతగా కార్మికులు కూడా ముందుకు రావాలి. క్వార్టర్స్‌లోనే కాక దారిలోనూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి.

– అజ్గర్‌ఖాన్, సింగరేణి కార్మికుడు

జీఎం దృష్టిలో ఉంది..



సింగరేణి క్వార్టర్స్‌లో రక్షణ అంశం జీఎం షాలేంరాజు దృష్టిలో ఉంది. పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులతో జీఎం చర్చించారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు చేపడతారు.

– నర్సింహారావు, పీఓ, కిష్టారం

రైతులపై ప్రకృతి ప్రకోపం



నేలకొండపల్లి : ధాన్యం రాశుల్లో నీటిని బయటకు పంపుతున్న రైతులు



వేంసూరు : రామన్నపాలెంలో నేలవాలిన వరి పంట



తల్లాడ : కుర్నవల్లిలో కూలిన సొసైటీ షెడ్డు



తల్లాడ : గొల్లగూడెంలో నేలకొరిగిన వరి పైరు



వైరా రూరల్ : తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న అన్నదాతలు



కల్లూరు రూరల్ : శాంతినగర్‌లో చెట్టు విరిగి పడిపోవడంతో దెబ్బతిన్న ఇల్లు



వైరా రూరల్ : తడిసిన ధాన్యం రాశిని చూపిస్తున్న రైతు



వైరా రూరల్ : ఖానాపురంలో నేలరాలిన మామిడికాయలతో రైతులు

అంతర్‌రాష్ట్ర ముఠాలు వచ్చాయా?

- సత్తుపల్లి చోరీతో అప్రమత్తమైన పోలీసులు
- క్లూస్‌టీం ఆధారాలతో గుర్తింపు?

ఖమ్మంక్రైం: జిల్లాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర దొంగల ముఠాలు సంచరిస్తున్నట్లు పోలీసు యంత్రాంగం గుర్తించినట్లు తెలుస్తోంది. ఇటీవల సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్స్‌లో భారీ చోరీ జరగగా.. క్లూస్‌టీమ్ సిబ్బందికి లభించిన ఆధారాల ద్వారా ఈ ఘటనకు పాల్పడింది మధ్యప్రదేశ్, మహారాష్ట్ర దొంగల ముఠాలేనని గుర్తించినట్లు సమాచారం. కొన్నేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో సంచరించిన ఈ ముఠాలు పలు దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కకుండా వెళ్లారు. మళ్లీ ఇప్పుడు అదే ముఠాలు వచ్చినట్లు చూచాయగా గుర్తించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

భారీ చోరీలే లక్ష్యం

అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు వేసవి ప్రారంభం కాగానే రంగంలోకి దిగి ఎంచుకున్న ప్రాంతాల్లో చోరీలు చేస్తుంటారు. ఒకటి, రెండు ఇళ్లు కాక సమూహంగా ఉండే కాలనీలు, అపార్ట్‌మెంట్లను గుర్తించి తాళం వేసి ఉన్న బ్లాక్‌ల్లో ఒకేరోజు చోరీ చేయడం వీరి నైజంగా తెలుస్తోంది. అంతేకాక చోరీ చేయగానే మరో ప్రాంతానికి వెళ్తారని.. ఇందుకోసం రైలు మార్గాలనే ఎంచుకుంటారని సమాచారం. అది సాధ్యం కాకపోతే ముఠా సభ్యులు ఒకరు లేదా ఇద్దరుగా విడిపోయి బస్సులు, ఆటోలు, లారీలలో ప్రయాణిస్తూ ముందు అనుకున్న చోట కలుస్తారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సత్తుపల్లి తెలంగాణ – ఏపీకి సరిహద్దుగా ఉండడం .. బస్సులు, ఇతర వాహనాలు 24గంటలు అందుబాటులో ఉండడంతో ఇక్కడ చోరీకి ఎంచుకున్నట్లు సమాచారం. చోరీ చేశాక ఎవరికీ అనుమానం రాకుండా వాహనాలు మారుతూ వందల కి.మీ. ప్రయాణిస్తాని.. మార్గమధ్యలో గ్రామాల శివార్లలో నిద్రిస్తారని తెలుస్తోంది. ఒకవేళ వీరి స్వస్థలాలను గుర్తించి అరెస్ట్ చేయడానికి వెళ్తే పోలీసులపై దాడులకు సైతం వెనుకాడరని చెబుతున్నారు.

పెట్రోలింగ్ విస్తృతంగా పెంచాలి

జిల్లాలో పోలీస్ పెట్రోలింగ్ విస్తృతంగా పెంచాలని పలువురు కోరుతున్నారు. అనుమానితులు, పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తే చోరీ కేసును చేధించే అవకాశముంటుంది. లేనట్లయితే వేసవి సెలవుల్లో అంతా విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్తే ఈ ముఠాలు మరింత చెలరేగే ప్రమాదముంది. కాగా, జిల్లాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర దొంగల ముఠాలు తిరుగుతున్నాయనే అంశంపై ఓ పోలీస్ అధికారిని వివరణ కోరగా.. సత్తుపల్లిలో భారీ చోరీ ద్వారా ఈ విషయాన్ని చూచాయగా గుర్తించినా స్పష్టత రాలేదని.. త్వరలోనే ఏ ముఠానో తేలుస్తామని వెల్లడించారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

మధిర: వంట పని నేర్చుకోకపోతే ఎలా అని తల్లి మందలించడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మధిర శ్రీనగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. మధిరలోని కోల్డ్‌స్టోరేజీలో పనిచేసే యాదగిరికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ఈక్షిత(24) వివాహం జరగగా ఆమె కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 16న ఈక్షిత కుమారుడికి అన్నప్రాసన ఉండడంతో వంట పని నేర్చుకోవాలని ఆమె తల్లి మందలించింది. దీంతో క్షణికావేశంలో గదిలోకి వెళ్లిన ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏదో పనిపై వెళ్లి ఉంటుందని భావించిన కుటుంబీకులు కాసేపటికి చూడగా తలుపు గడియ వేసినట్లు గమనించారు. దీంతో తలుపు పగలగొట్టి చూడగా అప్పటికే ఈక్షిత మృతి చెందింది.

పర్యావరణ పరిరక్షకుడు వనజీవి..

నివాళులర్పించిన పలువురు నేతలు

ఖమ్మంరూరల్: కోటి మొక్కలకు పైగా మొక్కలు నాటి మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణకు బాటలు వేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య ధన్యజీవిగా నిలిచిపోతారని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన రామయ్య ఇటీవల మృతి చెందగా, సోమవారం ఆయన స్వగృహంలో జరిగిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఆయన ఇంటి వద్ద మొక్క నాటారు. అలాగే, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కూడా రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, బెల్లం వేణు, గ్రీన్ భద్రాద్రి ట్రస్ట్ అధ్యక్షుడు యోగి సూర్యనారాయణతో పాటు అకిశెట్టి ఉమాశంకర్, తిరుమలరావు, రాణి, కంచెర్ల శ్యాం, భీమవరపు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామయ్య భార్య జానకమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నామా, నాయకులు

మరణంలోనూ వీడని బంధం

భార్య చనిపోయిన గంట వ్యవధిలోనే భర్త మృతి

నేలకొండపల్లి: పెళ్లినాటి బాసలను ఆయన యాది మరువలేదు. చివరి వరకు పట్టిన చేయి వీడనని ఇచ్చిన మాటను ఆచరించడమే కాక మరణంలోనూ ఆమె వెంటే నడిచాడో భర్త. నేలకొండపల్లి మండలంలోని రామచంద్రాపురానికి చెందిన బూధాటి హనుమరెడ్డి(81) – యశోద(76) దంపతులు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. యశోద ఆదివారం ఇంట్లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడగా తలకు బలమైన గాయమైంది. దీంతో ఆమెను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందింది. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటి నుంచి ఆందోళన చెందుతున్న హనుమరెడ్డి.. యశోద మృతి విషయం తెలియగానే గుండెపోటుకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులను ఆస్పత్రికి తరలించగా గంట వ్యవధిలోనే మృతి చెందాడు. దంపతుల మృతితో గ్రామంలో విషాదం అలుముకోగా.. ఒకే ట్రాక్టర్‌పై మృతదేహాలను ఉంచి అంతిమయాత్ర నిర్వహించాక అంత్యక్రియలు పూర్తిచేశారు.





హనుమరెడ్డి, యశోద (ఫైల్)

శిశుగృహకు కవల ఆడపిల్లలు

దత్తత తీసుకున్న వారి నుంచి స్వాధీనం

చింతకాని: కవల ఆడ శిశువుల అదృశ్యంపై ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. దత్తత తీసుకున్న వారి నుంచి ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు శిశువులను చేరదీసి ఖమ్మంలోని శిశుగృహకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన నల్లగాజు మల్లేష్–ఉమ దంపతులకు గతంలో ఇద్దరు ఆడపిల్లలు ఉండగా గత నెల 31న ఉమ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కవల ఆడ శిశువులకు జన్మనిచ్చింది. దీంతో వారిని పోసించడం భారంగా భావించిన మల్లేష్.. ఆస్పత్రిలోనే వేర్వేరు కుటుంబాల వారికి దత్తత ఇచ్చాడు. అయితే, శిశువు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసేందుకు వారి ఇంటికి వెళ్లిన ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించగా ఈనెల 11న అధికారులు మల్లేష్ ఇంటికి అధికారులు వెళ్లి విచారణ చేపట్టారు. పిల్లల్ని పోషించలేని స్థితిలో తమ బంధువులకే దత్తత ఇచ్చామని మల్లేశ్ సమాధానం చెప్పాడు. కానీ నిబంధనలకు విరుద్ధంగా దత్తత ఇవ్వడంతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా సోమవారం నాటికి శిశువులను తీసుకొస్తానని లేఖ రాసి ఇచ్చాడు.



తల్లిదండ్రులు, శిశువులతో ఐసీడీఎస్, చైల్డ్ లైన్ అధికారులు

ఆ కుటుంబాల నుంచి స్వాధీనం

ఆడశిశువులు ఇద్దరిని పిల్లలు లేని తమ దగ్గరి బంధువులకే ఇచ్చామని మల్లేశ్ అధికారులను నమ్మించాడు. ఎట్టి పరిస్థితుల్లో వారిని రప్పించాలని సూచించిన అధికారులు విచారణ చేపట్టగా పిల్లలను ఖమ్మంలోని ఇద్దరు వేర్వేరు దంపతులకు దత్తత ఇచ్చినట్లు తేలింది. ఈక్రమాన డబ్బు చేతులు మారినట్లు ప్రచారం జరిగినా అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ఇక సోమవారం దత్తత తీసుకున్న వారి నుంచి శిశువులను మల్లేశ్ దంపతులు తీసుకురాగా, వారి ఇంటికి ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు వెళ్లి పిల్లలను పోషిస్తారా, తమకు అప్పగిస్తారా అని ప్రశ్నిస్తే తామే పోషిస్తామని సమాధానం ఇచ్చారు. కానీ ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నందున దంపతులు పోషిస్తారనే నమ్మకం లేకపోవడంతో మల్లేశ్ దంపతులు, శిశువులను ఖమ్మంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. కమిటీ చైర్‌పర్సన్ కౌన్సెలింగ్ ఇచ్చాక శిశువులను శిశుగృహలో ఉంచాలని నిర్ణయించారు.

సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యాయత్నం

పోలీసులు సహా పలువురు వేధిస్తున్నారని వెల్లడి

కొణిజర్ల: సంబంధం లేని కేసు విషయమై కొణిజర్ల పోలీసులతో పాటు మరికొందరు వేధిస్తున్నారంటూ మండలంలోని రామనరసయ్యనగర్‌కు చెందిన జె.రవి సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండల కేంద్రానికి చెందిన ఓ బాలికను మండలంలోని మల్లుపల్లికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో తీసుకెళ్లాడు. అయితే, రవి ద్విచక్రవాహనాన్ని ఉపయోగించడంతో బాలిక తండ్రి ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ సూరజ్, కొణిజర్లకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి రవికి ఫోన్ చేసి కేసు విషయమై మాట్లాడేందుకు స్టేషన్‌కు రావాలని సూచించారు. కానీ కేసుతో తనకు సంబంధం లేదని, బాలికను తీసుకెళ్లిన యువకుడు తన తమ్ముడి కారు డ్రైవర్‌గా పనిచేస్తాడని తెలిసినా రామనరసయ్యనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు, పోలీసులతో కలిసి వేధిస్తున్నారంటూ సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు రవిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సూరజ్‌ను వివరణ కోరగా బాలికను తీసుకెళ్లిన యువకుడి ఆచూకీ తెలుసుకునే నిమిత్తం స్టేషన్‌కు రమ్మన్నామే తప్ప బెదిరింపులకు పాల్పడలేదని తెలిపారు.

అసత్య ఆరోపణలు సరికాదు

పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా అసత్య ఆరోపణలు చేయడం సరికాదని వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్ ఓ ప్రకటనలో తెలిపారు. రామనరసయ్యనగర్‌కు చెందిన రవి వద్ద ట్రాలీ డ్రైవర్‌గా పని చేస్తున్న వివాహితుడైన ఓర్సు నరసింహారావు బాలికను తీసుకెళ్లగా ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రవి ప్రోద్బలంతోనే నర్సింహారావు తన కుమార్తెను తీసుకెళ్లాడని ఫిర్యాదులో పేర్కొనగా విచారణకు పిలిచామే తప్ప వేధించామని చెప్పడం సరికాదని తెలిపారు.

ప్రియుడి హత్య కేసులో మహిళ అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ప్రేమ పేరుతో సహజీవనం చేస్తూ చివరకు ప్రియుడిని హత్య చేసిన మహిళను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలు... ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రాఘవపురానికి చెందిన మడికంటి లావణ్యకు భర్తతో విభేదాల కారణంగా విడిపోయి ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో తన తండ్రితో కలిసి నివసించేది. ఏడాది క్రితం తండ్రి మృతి చెందగా, అప్పటికే వివాహమైన కోసన రవిప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి సత్తుపల్లిలోని అద్దె ఇంట్లో సహజీవనం ప్రారంభించిన వారు ఐదు నెలలు క్రితం ఖమ్మం నేతాజీ నగర్‌కు మకాం మార్చారు. ఇక్కడే టైలరింగ్ చేస్తూ నివసిస్తున్నారు. అయితే, కొన్నాళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండడంతో ఈనెల 6వ తేదీ మద్యం తాగొచ్చిన రవిప్రసాద్ అనుమానంతో లావణ్యతో వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలోనే ఆయన లావణ్య కుడిచేతిపై గట్టిగా కొరగగా.. ఆవేశానికి లోనైన లావణ్య ఆయన బనియన్‌ను మెడకు బిగించి ఊపిరాడకుండా చేస్తూ కాళ్లతో తన్నడంతో రవిప్రసాద్ మృతి చెందాడు. ఈమేరకు లావణ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో కారు ఢీకొనగా దంపతులకు గాయాలయ్యాయి. బోదులబండకు చెందిన పొట్టపింజర రవికుమార్–భవాని సోమవారం రహదారి వెంట ఉండగా, ఓ కారు ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలైనా, కారు యాజమాని వెళ్లిపోసాగాడు. దీంతో స్థానికులు అడ్డుకోవడంతో క్షతగాత్రులకు ఆయన స్థానికంగా చికిత్స చేయించి ఖమ్మం తరలించారు.

చోరీ చేస్తూ పట్టుబడిన వ్యక్తి

సత్తుపల్లిటౌన్: బస్సు ఎక్కుతున్న ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ఇద్దరిని స్థానికులు వెంబడించగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. సత్తుపల్లి బస్టాండ్‌లో సోమవారం పలువురు బస్సు ఎక్కుతుండగా ఇద్దరు రెండు సెల్‌ఫోన్లు దొంగిలిస్తుండగా కొందరు గుర్తించారు. దీంతో వారిని వెంబడించగా, బస్టాండ్ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు వెళ్లి గోడ దూకి పడిపోయారు. అందులో ఓ వ్యక్తి పారిపోగా, ఇంకో వ్యక్తి మాత్రం స్థానికులకు చిక్కాడు. దీంతో ఆయన నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించగా విచారిస్తున్నారు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. గుంటూరు – సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ఖమ్మం బ్రాహ్మణబజార్‌కు చెందిన కాముని వెంకటేశ్వర్లు(55) – రాజేశ్వరి దంపతులు సోమవారం హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్తున్నారు. రైలు డోర్నకల్ సమీపిస్తున్న సమయాన బాత్‌రూంకు వెళ్తున్న రాజేశ్వరరావు కుదుపులకు జారి కింద పడడంతో మృతి చెందారు. దీంతో ఆయన భార్య రాజేశ్వరికి డోర్నకల్‌లో దిగి పోలీసులను ఆశ్రయించింది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్.. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

పాఠశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్లలో ఓ పాఠశాల బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన చెరుకుపల్లి నర్సింహ(40) సోమవారం తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఖమ్మంలో ఉంటున్న కూతురును చూడడానికి బయలుదేరాడు. ఈక్రమాన ఖమ్మం నుండి గుదిమళ్లకు విద్యార్థులతో వస్తున్న బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సింహకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు బస్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.